క్లుప్తంగా

ఆర్థోపెడిక్ వైద్య శిబిరం రేపు

బీచ్ రోడ్డు: రామ్‌నగర్‌లోని రైజ్ ఆర్థోపెడిక్ క్లినిక్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు ఆర్థో పెడిక్ డాక్టర్ ఎం.సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు. వెన్నెముక సమస్యతో బాధపడుతున్న వారికి పరీక్షలు చేస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం 89846 65666 నంబరులో సంప్రదించాలన్నారు.

నిరుపేదలకు అన్నదానం



ఆహార ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న చారిటీ బాక్సు సభ్యులు

బీచ్ రోడ్డు: చారిటీ బాక్సు ఆధ్వర్యంలో నగరంలోని పలు చోట్ల శుక్రవారం నిరుపేదలకు అన్నదానం చేశారు. బీచ్ రోడ్డులోని నిరాశ్రయులకు ఆహార ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చారిటీ బాక్సు సంయుక్త కార్యదర్శి కొంతం శివాజీ ప్రసాద్ మాట్లాడుతూ అన్నార్తులకు, అభాగ్యులకు సేవ చేయడం అనేది పూర్వజన్మ సుకృతమన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు మదీనా బీబీ, శ్రీకాంత్, లక్కోజు నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

'విద్యుత్ చార్జీలు తగ్గించాలి'



విద్యుత్ బిల్లులు దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

ఆరిలోవ: విద్యుత్ చార్జీలు తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్.కె.ఎస్.వి. కుమార్ డిమాండ్ చేశారు. సీపీఎం ఆరిలోవ జోన్ ఆధ్వర్యంలో శుక్రవారం బీఎస్ఆర్ నగర్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసర ధరలతో పాటు విద్యుత్ చార్జీల భారం మోపడం దారుణమన్నారు. ఈ నెల 4న రూరల్ తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేపడతామన్నారు. అనంతరం విద్యుత్ బిల్లులను దహనం చేశారు. కాలనీలోని సచివాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యకమంలో పార్టీ నాయకులు నరేంద్రకుమార్, శంకర్, రంగమ్మ, సత్యనారాయణ, అప్పారావు, నాగరాజు, రమణ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 74 మందికి ఉద్యోగాలు



అభ్యర్థులకు సూచనలు ఇస్తున్న అధికారులు, సంస్థ ప్రతినిధులు

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రెనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించిందని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సీహెచ్ సుబ్బిరెడ్డి (క్లరికల్) తెలిపారు. ఐఐఎఫ్ఎల్ సంస్థ ఫైనాన్స్, ఆర్‌బీఎల్ బ్యాంక్, ఆథాస్ సొల్యూషన్స్, ఎంఎఎస్ మెరైన్ సర్వీసెస్, ట్రీనిటెక్ ఇన్నా ఇండియా, టీం లీజ్, బయో ఫోర్, డెక్కన్ ఫైన్ కెమికల్స్, మేధా సర్వో డ్రైవ్, రిలయన్స్ డిజిటల్ పలు ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 690 ఖాళీల భర్తీకి నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 287 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో 74 మంది అభ్యర్థులు ఎంపికైనట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలించి అనంతరం జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సీహెచ్ సుబ్బిరెడ్డి చేతులు మీదుగా నియామక పత్రాలు అందజేశారు.

టేకు కలప భద్రం



కలపను పరిశీలిస్తున్న సీఎస్‌వో, ఇతర అధికారులు



భద్రపరిచిన టేకు దుంగలు

- ప్రధాని పర్యటన సమయంలో భద్రత కోసం చెట్ల నరికివేత
- అప్పటి నుంచి దుంగలను ఏయూలో నిల్వ చేసిన అధికారులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో గతంలో ప్రధానమంత్రి బహిరంగ సభ నిర్వహించిన సమయంలో భద్రత చర్యల్లో భాగంగా జీవీఎంసీ సిబ్బంది కట్ చేసిన టేకు చెట్లను అధికారులు భద్రపరిచారు. వీటిని ప్రత్యేకంగా ఒక స్థలంలో నిల్వ చేసి, పర్యవేక్షిస్తున్నారు. శుక్రవారం ఏయూ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ మహ్మద్ ఖాన్ ఏయూ ఇంజినీర్ ఆర్.శంకరరావు, బ్యూటిఫికేషన్, శానిటేషన్ డీన్ ఆచార్య జి.వీర్రాజుతో కలిసి భద్రపరచిన టేకును పరిశీలించారు. ఏయూలో తొలగించిన టేకు కలప లక్షలాది రూపాయలు విలువ చేస్తుందని, వీటిని ఎవరికి విక్రయించారు? ఆ సొమ్ము ఎవరు తిన్నారంటూ? పలు పత్రికల్లో ఇటీవల కథనాలు ప్రచురితం కావడంపై ఏయూ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అవగాహన రాహిత్యం, అసత్యాలను ప్రచారం చేస్తూ ఏయూపై తప్పుడు కథనాలు ప్రచురించడం సరికాదని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వాస్తవాలు తెలుసుకుని కథనాలు రాయాలని హితవు పలికారు. భద్రతతో నిరంతరం వీటిని పర్యవేక్షిస్తూ, పరిరక్షించడం జరుగుతోందని సీఎస్‌వో మహ్మద్ ఖాన్ తెలిపారు. అటవీశాఖ అధికారుల సమక్షంలో తొలగించిన టేకు చెట్ల కలపను నంబర్లు వేసి భద్రపరిచామన్నారు. తొలగింపునకు అవసరమైన అనుమతుల కోసం నిర్ణీత రుసుం కూడా చెల్లించామని శానిటేషన్ డీన్ ఆచార్య జి.వీర్రాజు తెలిపారు.

పారదర్శకంగా పనులు

విశ్వవిద్యాలయంలో పూర్తిస్థాయిలో పారదర్శకంగా పనుల నిర్వహణ జరుగుతోంది. దీనిలో భాగంగా గతంలో ప్రధాని పర్యటన, బహిరంగ సభ సమయంలో తప్పనిసరి పరిస్థితుల్లో అన్ని అనుమతులు తీసుకుని జీవీఎంసీ అధికారులు సూచించిన విధంగా టేకు చెట్లను తొలగించారు. ఆ దుంగలను వెంటే ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి భద్రపరిచే పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టారు.


మొక్కల పెంపకానికి శ్రీకారం



ఇటీవల ఏయూలో నాటిన మొక్కలు

వర్సిటీలో భద్రత కారణాలతో తొలగించిన చెట్ల స్థానంలో మొక్కలు నాటే పనులకు అధికారులు ఇప్పటికే శ్రీకారం చుట్టారు. దశల వారీగా వర్సిటీలో విభిన్న ప్రాంతాలలో మొక్కలను నాటి కంటికిరెప్పలా సంరక్షిస్తున్నారు. జూలై, ఆగస్టు నెలలో వర్షాలు ప్రారంభమైన సమయంలో వర్సిటీలో రహదారులకు ఇరువైపులా పెద్ద ఎత్తున మొక్కలు నాటారు.

వైఎస్సార్ వర్ధంతి.. నేడు విస్తృతంగా సేవలు



ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఎంవీపీ కాలనీ: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని తూర్పు నియోజకవర్గంలో శనివారం పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని వార్డుల్లో కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జుల ఆధ్వర్యంలో ఆయా కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. వైఎస్సార్ విగ్రహాలకు క్షీరాభిషేకాలు, మెగా రక్తదాన శిబిరాలు, పేదలకు, రోగులకు పండ్ల పంపిణీ కార్యక్రమాలు చేపడతామని ఎంవీవీ తెలిపారు. తొలుత లాసన్స్‌బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పించే కార్యక్రమం జరుగుతుందన్నారు.

ఠంచన్‌గా పింఛన్



20వ వార్డులో పింఛన్ డబ్బులు అందిస్తున్న వలంటీర్



కిడ్నీ బాధితుడికి పెన్షన్ అందిస్తున్న గోవింద్

ఏయూ క్యాంపస్: అవ్వాతాతలు శుక్రవారం ఉదయాన్నే ప్రతి నెల మాదిరిగా ఠంచన్‌గా వైఎస్సార్ పెన్షన్ కానుక అందుకున్నారు. ఒకటో తేదీన తలుపు తట్టి గ్రామ వలంటీర్లు పెన్షన్ అందించారు. స్థానిక 20వ వార్డులో వలంటీర్లు స్వయంగా లబ్ధిదారుల ఇంటికి వెళ్లి వృద్ధాప్య, వితంతు, దివ్యాంగుల పెన్షన్ అందజేశారు. ఇంటికి వచ్చి ఒకటో తేదీన పెన్షన్ అందించడంపై వృద్ధులు సంతోషం వ్యక్తం చేశారు.

దయాలసిస్ రోగికి పెన్షన్ మంజూరు

బీచ్ రోడ్డు: జీవీఎంసీ 22వ వార్డు పీతలవానిపాలెం గ్రామంలో నివాసముంటున్న మాకర్పు తాతారావు కిడ్నీలు పాడైపోవడంతో రెండు నెలలుగా డయాలసిస్ చేసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పీతల గోవింద్.. తాతారావుతో డయాలసిస్ పెన్షన్ కోసం దరఖాస్తు చేయించాలని సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీకి సూచించారు. ఈ మేరకు ప్రభుత్వం పెన్షన్ మంజూరు చేయడంతో తాతారావు ఇంటికి వెళ్లి రూ.10వేలు పెన్షన్‌ను గోవింద్ అందజేశారు.

ఏయూ పరిశోధక విద్యార్థి ప్రతిభ

- అతిపెద్ద పుస్తకంలో తేజేశ్వరరావుకు స్థానం
- గుర్తింపు పత్రం అందించిన గిన్నీస్ బుక్ నిర్వాహకులు



తేజేశ్వరరావును అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ప్రపంచంలోనే అతిపెద్ద పుస్తక రచనలో భాగస్వామిగా నిలిచిన ఏయూ రసాయన శాస్త్రం విభాగం పరిశోధక విద్యార్థి డాక్టర్ వి.తేజేశ్వరరావును గిన్నీస్ బుక్ నిర్వాహకులు అభినందించారు. తమిళనాడుకు చెందిన ఈఎస్ఎన్ పబ్లికేషన్ సంస్థ 1,00,100 పేజీలతో 19.34 అడుగుల ఎత్తు కలిగిన «వరల్డ్ 2023 వైడ్ అవుట్‌కమ్ ఆన్ రీసెర్చ్ అండ్ లేటెస్ట్ డెవలప్‌మెంట్స్»పుస్తకాన్ని తీర్చిదిద్దింది. ఈ పుస్తకంలో తేజేశ్వరరావు దాదాపు వెయ్యి పేజీలతో కూడిన 25 చాప్టర్స్‌ని రచించారు. దీనిని పరిశీలించిన గిన్నీస్ బుక్ నిర్వాహకులు.. తేజేశ్వరరావును ప్రత్యేకంగా అభినందించారు. సర్టిఫికెట్, మెడల్‌ను ఇటీవల చెన్నైలో జరిగిన కార్యక్రమంలో అందజేశారు.

వీసీ అభినందన

ఏయూకు అనుబంధంగా ఉన్న ఎంవీఆర్ డిగ్రీ, పీజీ కళాశాలలో రసాయన శాస్త్రంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న తేజేశ్వరరావును ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి శుక్రవారం తన కార్యాలయంలో అభినందించారు. ఇటువంటి అత్యంత అరుదైన ఘనతను సాధించడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంవీఆర్ డిగ్రీ కళాశాల కరాస్పాండెంట్ డాక్టర్ వి.రామారావు పాల్గొన్నారు.

ఖైదీలకు ఆరోగ్యంపై అవగాహన



ఖైదీలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో ఖైదీలకు సుఖవ్యాధులపై డిస్ట్రిక్ట్ ఎయిడ్స్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ యూనిట్(డీఏపీసీయూ) ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇస్తా(ఐఎస్‌హెచ్‌టీహెచ్) ప్రచారంలో భాగంగా హెచ్ఐవీ, హెపటైటిస్, టీబీ, ఆర్‌పీఆర్ తదితర వాటి వ్యాధుల గురించి వివరించారు. వాటి వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఏపీసీయూ డైరెక్టర్ కె.శైలజ, జైల్ సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ కె.వి.శాంతి, జైలు అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి



మాట్లాడుతున్న కాలనీ వాసులు

ఏయూ క్యాంపస్: పలు సమస్యలతో సతమతమవుతున్నామని ఈస్ట్ పాయింట్ కాలనీలోని డిఫెన్స్ క్వార్టర్స్ ప్రాంతవాసులు తెలిపారు. శుక్రవారం సాయంత్రం కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధి సుధాకర్ మాట్లాడారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా రహదారుల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కోరారు. అదే సమయంలో ఫుట్‌పాత్‌లపై దుకాణాలు పెరిగిపోతున్నాయని, ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, వీటికి పరిష్కారం చూపాలన్నారు. రాత్రివేళల్లో ఆకతాయిల నుంచి ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వాటిని నియంత్రించాలని విజ్ఞప్తి చేశారు. జీవీఎంసీకి ఇప్పటికే పలుమార్లు లేఖలు రాశామని, అధికారులు సత్వరం స్పందించాలన్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు ఎం.ఎస్.శర్మ, కుమార్ రాజ, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

మంగళకారిణి.. సౌభాగ్యప్రదాయిని



శ్రావణలక్ష్మి పూజలో పాల్గొన్న ఉభయదాతలు

డాబాగార్డెన్స్: సకల సౌభాగ్యాలు ప్రసాదించే శ్రావణలక్ష్మి నామస్మరణ మార్మోగింది. శ్రావణ మాసపు పవిత్ర శుక్రవారం వరలక్ష్మి వ్రతాన్ని ప్రజలు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. ఇళ్లల్లో అమ్మవారిని పూజించారు. బంగారు కాసులతో కొలిచారు. అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మరోవైపు వరలక్ష్మీ వ్రతాలు, ప్రత్యేక కార్యక్రమాలతో నగరంలో ఎక్కడ చూసినా ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. బురుజుపేటలో కొలువుదీరిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మూడో శుక్రవారం వ్రత పూజలు వైభవంగా జరిగాయి. అమ్మవారిని విశేషంగా అలంకరించి, వేద మంత్రాలు, నాదస్వర వాయిద్యాల మధ్య ఉదయం 8 గంటలకు శ్రావణ లక్ష్మి పూజలు ప్రారంభించారు. పూజలో 255 మంది ఉభయదాతలు నేరుగా పాల్గొన్నారు. పోస్టు ద్వారా వివరాలు పంపి డబ్బు చెల్లించిన పలువురి పేరిట అర్చన చేసి, వారికి కుంకుమ, ప్రసాదం పంపారు. అమ్మవారిని కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున కుటుంబ సభ్యులు, పలువురు ప్రముఖులు, అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. శ్రావణ మాసంలో జరిగే పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2711725, 2568645 నంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని ఆలయ ఈవో శిరీష తెలిపారు.

'అవంతి'లో ఇండియన్ ఐడల్ శ్రీరామచంద్ర సందడి



పాట పాడుతున్న సింగర్ శ్రీరామచంద్ర

తగరపువలస: చెరకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం సాయంత్రం ఇండియన్ ఐడల్ శ్రీరామచంద్ర సందడి చేశారు. తాను నటించిన పాపం పసివాడు సినిమా ఓటీటీ వేదిక ఆహాలో ఈ నెలలో విడుదల అవుతున్న సందర్భంగా ప్రమోషనలో భాగంగా ఇక్కడకు వచ్చారు. కొత్త తరహాలో ఉంటున్న ఈ సినిమాలో రెండు పాటలు అందరినీ ఆకట్టుకుంటాయని శ్రీరామచంద్ర అన్నారు. ఈ సందర్భంగా తన పాటలతో విద్యార్థులను ఉర్రూతలూగించారు. అనంతరం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శ్రీరామచంద్రను సత్కరించారు.

3న ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

ఏయూ క్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రం ఆధ్వర్యంలో శనివారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్టు కేంద్రం సంచాలకుడు ఆచార్య ఒ.ఎస్.ఆర్.యు.రమేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు యోగా కేంద్రం ఆవరణలో ఈ శిబిరం నిర్వహిస్తామన్నారు. కేజీహెచ్ ఆయుష్ విభాగం పూర్వ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కె.ఈశ్వరరావు రోగులను పరీక్షించి, తగిన చికిత్స విధానాలు తెలియజేస్తారని పేర్కొన్నారు. రోగులు తమ రిపోర్టులను వెంట తీసుకురావాలని సూచించారు. పూర్తి వివరాలకు 94401 91673 నంబరులో సంప్రదించాలన్నారు.

శ్రీకృష్ణ కథామృత సప్తాహం ప్రారంభం



ప్రవచిస్తున్న సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి

సీతంపేట: శ్రీకృష్ణుడి అన్ని అవతారాల గురించి గాథలు, విశేషాలు మహద్భాగవతంలో వివరించారని శంకరాచార్య, లలితా పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి అన్నారు. లలితానగర్ లలితా పీఠంలో శుక్రవారం ప్రారంభమైన శ్రీకృష్ణ కథామృత సప్తాహంలో భాగంగా మొదటి రోజు శ్రీకృష్ణుని గాథలపై స్వామీజీ ప్రవచించారు. దశమ స్కందంలో కృష్ణుడి బృందావన విహారం ప్రధాన అంశగా బ్రహ్మవైవర్తన పురాణంలో చెప్పబడిందన్నారు. శ్రీమద్భాగవతంలో ఎక్కడా రాధాదేవి పేరు లేదని, గోపికల గురించి మాత్రమే ప్రస్తావించారన్నారు. బృందావన భాగవతం కృష్ణ లీలా గాథల ప్రస్తావన ఏడు రోజుల పాటు జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో శక్తి పీఠాధీశ్వరి మాతా రమ్యానంద భారతీ స్వామిని, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణ సేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

'ఉక్కు' ఊపిరిని ఆపలేరు



దీక్షలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: పోరాటాలు, బలిదానాల ద్వారా ఏర్పాటు చేసుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమ జోలికి వస్తే అధోగతి పాలుకాక తప్పదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు హెచ్చరించారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 932వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన సింటర్‌ప్లాంట్ విభాగ కార్మికులు పాల్గొని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ఆగస్టులో విశాఖ స్టీల్ ప్లాంట్ మెరుగైన అమ్మకాలు సాధించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ని అవాంతరాలు సృష్టించినా.. విశాఖ ఉక్కు కర్మాగారం ఊపిరి ఆపివేయాలని చూసినా కార్మికులు మొక్కవోని దీక్షతో ప్లాంట్‌ను లాభాల దిశగా నడిపించేందుకు చేస్తున్న కృషికి జోహార్లు తెలుపుతున్నామన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ అంశాన్ని విరమించుకోవాలని, లేకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి చక్కర్లు కొడితే చర్యలు

- రాత్రి 12 గంటల తరువాత ఫుడ్ కోర్టులు మూసేయాలి
- క్రైం డీసీపీ నాగన్న
- ద్వారకా క్రైం స్టేషన్ సందర్శన



పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న క్రైం డీసీపీ నాగన్న

సీతమ్మధార: అర్ధరాత్రి 2 నుంచి 4 గంటల మధ్యలో రోడ్లపై వాహనాలు కనిపిస్తే సీజ్ చేయాలని క్రైం డీసీపీ నాగన్న ఆదేశించారు. ద్వారకా జోన్ క్రైం పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. సిబ్బంది వివరాలు, వారి విధుల నిర్వహణ గురించి అడిగి తెలుసుకుని పలు రికార్డులు పరిశీలించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా మీడియాతో డీసీపీ నాగన్న మాట్లాడుతూ రాత్రి 12 గంటల తరువాత ఫుడ్ కోర్టులు ఎక్కడ తెరిచి ఉన్నా.. వెంటనే వాటిని మూసివేయించాలన్నారు. నాలుగు సార్లు ఇలా చేస్తే జీవీఎంసీ అధికారులతో చర్చించి ట్రేడ్ లైసెన్స్‌లు రద్దు చేయిస్తామని చెప్పారు. అర్ధరాత్రి 12 నుంచి ఒంటి గంట వరకు జోనల్ సీఐలు, ఎస్ఐలు వారి పరిధిలోని లాడ్జీల్లో తనిఖీలు జరపాలని, ఒంటి గంట నుంచి 2 వరకు బీట్స్ చెక్ చేయాలన్నారు. 2 నుంచి 4 గంటల మధ్యలో దొంగతనాలు జరిగే అవకాశమున్నందున రోడ్లపై ఎవరు కనిపించిన స్టేషన్‌కు తరలిస్తామని హెచ్చరించారు.

ఊరెళ్తే సమాచారమివ్వండి

క్యాంప్‌లు, వివిధ పనులపై దూరప్రాంతాలకు వెళ్లేవారు సమీప పోలీస్ స్టేషన్‌లో ముందుగా సమాచారమివ్వాలని డీసీపీ సూచించారు. విలువైన వస్తువులను లాకర్‌లో గానీ సన్నిహితుల వద్ద భద్రపరచుకోవాలన్నారు. ఇంటి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

చైన్ స్నాచర్లు, పెట్రోల్ దొంగలపై నిఘా

వాహనాల నుంచి పెట్రోల్ దొంగిలిస్తున్న వారిలో ఎక్కువ శాతం మైనర్లు ఉంటున్నారని, వారిపై ప్రత్యేక నిఘా పెట్టామని నాగన్న చెప్పారు. వాకింగ్‌కు వెళ్లే మహిళలు బంగారు ఆభరణాలు కనిపించకుండా ఉండేలా చూసుకోవాలని, చైన్ స్నాచింగ్ జరిగితే.. నిందితుల బండి నంబర్ గుర్తు పెట్టుకోవాలని సూచించారు. రాత్రిళ్లు ఇంటి వద్ద పార్క్‌చేసే ద్విచక్ర వాహనాలకు నాణ్యమైన లాక్ వేసుకోవాలని సూచించారు. దొంగతనాలు జరిగేటప్పుడు తప్పుడు ఫిర్యాదు చేయవద్దని కోరారు.

రాత్రి వేళ అప్రమత్తం

ఆపదలో ఉన్న వారి సహాయార్థం ఏర్పాటు చేసిన డయల్ 100కు కొంత శాతం తప్పుడు కాల్స్ వస్తున్నాయని డీసీపీ అన్నారు. రాత్రి బీట్‌లు నిర్వహించే కానిస్టేబుళ్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. రాత్రి వేళ ఒక క్రేన్ అందుబాటులో ఉండాలని సూచించారు. రాత్రి పూట నగరంలో రోడ్డు ప్రమాదాలు సంభవించినప్పుడు వెంటనే క్రేన్ ద్వారా ట్రాఫిక్‌ను క్లియర్ చేయవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ద్వారకా క్రైం సీఐ ఇమ్మానియేల్‌రాజ్, ఎస్ఐ నిహార్ పాల్గొన్నారు.


స్కూల్ బస్ ఢీకొని వృద్ధుడి మృతి



ఈశ్వరరావు (ఫైల్)

సబ్బవరం: మండలంలోని సబ్బవరం–చోడవరం రోడ్డులోని ఆరిపాక సమీపంలో చెరుకు కాటా వద్ద స్కూల్ బస్ ఢీకొన్న ఘటనలో వృద్ధుడితో పాటు ఆవు మృతి చెందింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆరిపాక గ్రామానికి చెందిన వృద్ధుడు దాసుబిల్లి ఈశ్వరరావు(65) వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నారు. కొన్నేళ్ల కిందట భార్య మృతి చెందడంతో ఆవును మేపుతూ సోదరి వద్ద ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. సోదరి ఆరిపాక సమీపంలోని టెక్కలిపాలెం జంక్షన్ వద్ద నివాసం ఉంటుంది. మృతుడు ఈశ్వరరావు శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో భోజనం చేసి ఆవును తీసుకొని చెరుకు కాటా సమీపంలోని పాక దగ్గరకు వెళ్తున్నాడు. కాటా వద్ద రోడ్డు దాటుతుండగా అదే సమయంలో చోడవరం వైపు నుంచి విశాఖవైపు పెళ్లి వారిని తీసుకుని వెళుతున్న స్కూల్ బస్సు ఢీ కొట్టింది. ఈశ్వరరావుకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడే మృతి చెందాడు. పాడి ఆవుకు కూడా మృతి చెందింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి సీఐ రంగనాథం,ఎస్ఐ అల్లు వెంకటేశ్వరరావు చేరుకొని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడి కుమారుడు విదేశాల్లో ఉండగా, కుమార్తె ఉన్నారు.

తెలుగు పద్యానికి పూర్వవైభవం



మాట్లాడుతున్న పద్య శిక్షకుడు ప్రకాశరావుశర్మ

సీతంపేట: పద్యం తెలుగు వారి సాంస్కృతిక ఆస్తని, దానిని కాపాడి భావి తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రపంచంలో ఉన్న తెలుగు వారందరిపై ఉందని పద్య శిక్షకుడు కొల్లారపు ప్రకాశరావు శర్మ అన్నారు. అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో స్థిరపడిన ఆయన విశాఖ సాహితి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన సభలో 'ప్రాచీన పద్య కవిత నుంచి ఆధునిక పద్య కవితా రచన వరకు' అనే అంశంపై ప్రసంగించారు. అమెరికా నుంచి ఇంటర్‌నెట్ ద్వారా నిత్యం ఎంతో మందికి పద్య రచనలో శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. విశాఖ సాహితి అధ్యక్షురాలు ఆచార్య కోలవెన్ను మలయవాసిని మాట్లాడుతూ అమెరికాలో స్థిరపడినప్పటికీ ప్రకాశరావు శర్మ తెలుగు సాహిత్యంపై ఉన్న అభిమానంతో పద్యానికి పూర్వవైభవం తీసుకురావడానికి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

అష్టలక్ష్మికి విశేష పూజలు



పూజలందుకున్న లక్ష్మీనారాయణస్వామి

కొమ్మాది : స్థానిక శ్రీ అష్టలక్ష్మీ దేవాలయంలో శ్రావణమాసం మూడవ శుక్రవారాన్ని పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించారు. వేకువ జామునే శ్రీ లక్ష్మీనారాయణ స్వామిని ప్రత్యేకంగా అలంకరించి సుప్రభాత సేవ అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఈ విశేష పూజల్లో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. అదే విధంగా 7వ తేదీన శ్రీ వైష్ణవ కృష్ణాష్టమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శ్రీధరస్వామి తెలిపారు.